'కావేరి' కోసం బనకచర్ల డ్రామా!

మొదటిపేజీ తరువాయి...

ఉమ్మడి లక్ష్యం వేగంగా అమలవుతున్నది. బరాజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) విచారణ కొనసాగుతున్న సమయంలోనే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధీనంలోని 'నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' (ఎన్‌డబ్ల్యూడీఏ) 2024, ఏప్రిల్ 15వ తేదీన వెల్లడించిన ఎజెండాలో మేడిగడ్డ బరాజ్ విఫలమైందని పేర్కొన్నది. దాని స్థానంలో గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించే ప్రతిపాదనను పొందుపరిచింది. వీలైతే ఇచ్చంపల్లి బరాజ్ నుంచి తెలంగాణ నీళ్లు తీసుకోవచ్చని సూచించింది. అంటే, కాళేశ్వరం ప్రాజెక్టును కాలగర్భంలో కలపాలని ముందుగానే నిర్ణయించుకున్నట్లు దీని ద్వారా స్పష్టమవుతుంది. ఈ కుట్రను గుర్తించిన బీఆర్ఎస్ గళం విప్పడంతో రాజకీయంగా దెబ్బతింటామని కాంగ్రెస్, బీజేపీ తెలుసుకొన్నాయి. చంద్రబాబును రంగంలోకి దింపి బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చి కొత్త డ్రామాను కొనసాగిస్తున్నాయి. తాజాగా బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం అని హైదరాబాద్‌లో చెప్పిన రేవంత్‌రెడ్డి, ఢిల్లీకి వెళ్లగానే ఇచ్చంపల్లి-కావేరీ లింకుపై చర్చిద్దామని కేంద్రం ముందు మోకరిల్లడమే కుట్రకు సాక్ష్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆరు దశాబ్దాల పాటు కృష్ణాజలాల్లో తీరంగా నష్టపోయిన తెలంగాణ, ఇప్పుడు గోదావరి జలాల్లోనూ చారిత్రక అన్యాయానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉన్నది. వాస్తవానికి ఈ కుట్ర ఐదేండ్ల కిందటే పురుడు పోసుకోగా, కేసీఆర్ ఉన్నంత వరకు అమలు కానీయలేదని చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దీనిని వ్యతిరేకించాల్సిందిపోయి, కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలనే లక్ష్యంతో 'కావేరీ' వ్యూహంలో పావుగా మారుతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఏడాదిన్నర కాలంలో జరిగిన నాటకీయ పరిణామాలే నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు.

డ్రామా-1: గోదావరి-కావేరీ అనుసంధానం

తమిళనాడులోని కావేరీ బేసిన్ ఒట్టిపోయింది. గోదావరిజలాలను అక్కడికి తరలించి తమిళ రైతుల్ని ఆకర్షించి ఓట్లు దండుకోవాలనేది బీజేపీ వ్యూహం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐదేండ్ల కిందటనే ఈ వ్యూహానికి పదును పెట్టినా కేసీఆర్ హయాంలో ముందుకుపోలేకపోయారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలో కీలక బాధ్యతల్లో ఉన్న తెలంగాణ వ్యక్తి ఒకరు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. గోదావరి-కావేరీ అనుసంధానంపై చర్చించారు. ప్రాజెక్టుపై ముందుకుపోయేందుకు పావులు కదిపారు. దీనిని పసిగట్టిన 'నమస్తే తెలంగాణ' మన నీళ్లను తన్నుకుపోయేందుకు కుట్రలు మొదలయ్యాయని వరుస కథనాలు ప్రచురించింది. బీఆర్ఎస్ సైతం గళం విప్పడంతో ఆ అంశాన్ని పక్కనపెట్టారు.

డ్రామా-2: మేడిగడ్డను పడావు పెట్టే కుట్ర

మేడిగడ్డ-సమ్మక్క బరాజ్‌ల మధ్య ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి అక్కడి నుంచి గోదావరిజలాలను కావేరీకి తరలించేలా కేంద్రం అలైన్‌మెంట్ రూపొందించింది. ఇది జరగాలంటే సాంకేతికంగా మేడిగడ్డ అడ్డుగా ఉంటుంది. అందుకే దానిని పునరుద్ధరించకుండా ఎన్‌డీఎస్‌ఏ, కమిటీలు, కమిషన్లు అంటూ ఏడాదిన్నరగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఇందుకు ఆధారాలు కూడా ఉన్నాయి. 15.4.2024న కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్‌డబ్ల్యూడీఏ 19వ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి ఎజెండా ఖరారు చేసింది. అందులో గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టులో మూడు అంశాలను పేర్కొన్నది. అందులో అత్యంత కీలకమైనది మేడిగడ్డ బరాజ్. ఈ బరాజ్ కుంగిపోయి వైఫల్యం చెందిన నేపథ్యంలో దాని దిగువన



building barrages on Indravathi river before it's confluence in Godavari, so this stored water can be used for diversion from Inchampalli.

3) Recently, the Medigadda barrage (of Kaleshwaram project) belonging to Telangana state which is located upstream of Inchampalli got sunk due to the failure of the foundation structures of the barrage. In case if Medigadda cannot be revived, then there is a scope to increase the height of the Inchampalli barrage to cater to the needs of both ILR component and also Telangana specific requirements that would be fulfilled by Medigadda. NWDA was also asked to look into this matter and report back.

ఎన్‌డబ్ల్యూడీఏ 19వ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి ఖరారు చేసిన ఎజెండా

ఇచ్చంపల్లి బరాజ్ నిర్మించి కావేరీకి గోదావరి జలాలను తరలించాలని, అవసరమైతే తెలంగాణ అక్కడి నుంచి నీళ్లు వాడుకుంటుందనేది దాని సారాంశం. ఆ సమయంలో మేడిగడ్డ బరాజ్‌పై సాంకేతిక అధ్యయనాలు, విచారణలు కొనసాగుతున్నాయి. విచారణ పూర్తి కాకుండానే బరాజ్ వైఫల్యం చెందిందని, ఇచ్చంపల్లి బరాజ్ నిర్మించాలని ఎందుకు నిర్ణయించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

డ్రామా-3: రంగంలోకి చంద్రబాబు

కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ పట్టుబడుతున్నది. తెలంగాణకు అన్యాయం చేస్తూ తమిళనాడుకు గోదావరిజలాలను ఎలా తన్నుకుపోతారంటూ ప్రశ్నిస్తున్నది. రాజకీయంగా కాంగ్రెస్, బీజేపీలను ఇది ఇరకాటంలోకి నెట్టింది. ఈ సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చారు. దీంతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్లాన్ మార్చింది. తెలంగాణను ఎండబెట్టేందుకు చంద్రబాబు ఎప్పుడైనా సిద్ధమనేది తెలంగాణ సమాజానికి దశాబ్దాల అనుభవమే. అందుకే చంద్రబాబు రంగంలోకి దిగారు. పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరిజలాలను కావేరీకి తరలించేలా సహకరిస్తానంటూ కేంద్రానికి హామీ ఇచ్చారు. గోదావరి నీటిని కృష్ణా, పెన్నా బేసిన్లలో వాడుకునేలా బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

డ్రామా-4: బనకచర్ల పేరుతో కుట్రలు

ఇచ్చంపల్లి దగ్గర బరాజ్ అని ముందు చెప్పిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు బనకచర్లను తెరమీదికి తేవడాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గమనించి అప్రమత్తం కావాలి. కానీ మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ జరగొద్దన్న ఏకైక లక్ష్యంలో భాగంగా రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా మౌనం వహించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బనకచర్ల కుట్రను 'నమస్తే తెలంగాణ' బట్టబయలు చేస్తూ వరుస కథనాలు ప్రచురించింది. ఇదే సమయంలో తెలంగాణకు జరగబోతున్న చారిత్రక అన్యాయంపై బీఆర్ఎస్ కన్నెర్రజేసింది. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మౌనం వీడలేదు. మరోవైపు చంద్రబాబు ఏకంగా ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించి బనకచర్ల కుట్ర నిజమేనని కుండబద్దలు కొట్టారు. ఎన్‌డబ్ల్యూడీఏ కూడా భాగస్వామ్య రాష్ట్రాలతో సమావేశానికి హైదరాబాద్ వేదికను ఖరారు చేసి అధికారికంగా లేఖలు పంపింది.

డ్రామా-5: కేంద్రం హామీ ఇచ్చిందని నాటకాలు

బీఆర్ఎస్ ఒత్తిడితో ఎట్టకేలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెర మీదకొచ్చి 'మేం అప్రమత్తంగానే ఉన్నాం. అసలు ఏపీ డీపీఆర్ సమర్పించలేదట. కేంద్ర మంత్రి నాకు స్వయంగా లేఖ రాశారు. మమ్మల్ని సంప్రదించనిది ముందుకు పోనని మాటిచ్చారు' అని తీరిగ్గా సెలవిచ్చారు. కానీ కేంద్రంలో బనకచర్ల నిర్మాణానికి పావులు శరవేగంగా ముందుకు కదిలాయి. ఏకంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అనుమతుల్లో భాగమైన టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్) ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీన వైఖరిని బీఆర్ఎస్ మరింత ఎండగట్టింది. మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బనకచర్ల కుట్రలను, తెలంగాణకు జరిగే అన్యాయాన్ని ప్రజల ముందుంచారు. దీంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లో బదనాం అవుతున్నామని గ్రహించి కొత్త డ్రామా మొదలు పెట్టింది.

మీకు నీళ్లెందుకు?

తెలంగాణ భూముల్లో పంటలు పండవు

అక్కడ వరిని సాగు చేస్తే నీటి వృథాయే

వరి పంటకు ఏపీ భూములే అనుకూలం

ఏపీని కాదంటే దేశ ఆహార భద్రతకే ముప్పు

కృష్ణాలో తెలంగాణ వాటాని తగ్గించాలి

సీమ పంటలకు కోటా కన్నుంచాలి

టైబ్యునల్‌లో ఏపీ సర్కార్ అఫిడవిట్

కౌంటర్‌ను తయారుచేస్తున్న తెలంగాణ

Sat, 20 January 2018

తెలంగాణకు నీళ్లు అవసరం లేదంటూ 2018లో ఏపీ సర్కారు వ్యాఖ్యలు

డ్రామా-6: అఖిలపక్ష ఎంపీల సమావేశం

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అఖిలపక్ష ఎంపీల సమావేశం నిర్వహించింది. సాధారణంగా పార్లమెంట్ సమావేశాల్లో తప్ప ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వాలు అఖిలపక్షం నిర్వహించడం అరుదని నిపుణులు చెప్తున్నారు. పైగా ఎక్కడైనా అఖిలపక్ష సమావేశమంటూ రాష్ట్రంలోని పార్టీలకు సమాచారం ఇచ్చి, పలానా అంశంపై పార్టీ నుంచి హాజరుకావాలని కోరుతారు. కానీ బనకచర్లపై మాత్రం ఎంపీల అఖిలపక్షం నిర్వహించడం వెనుక అసలు కుట్ర దాగి ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బనకచర్ల ద్వారా కావేరీకి గోదావరిజలాల తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దంటే 'కర్ర విరగొద్దు-పాము చావొద్దు' అన్నట్లుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడుతున్నారు. మరోవైపు ఇదే సమయంలో ఏపీ చంద్రబాబు మీడియా ముందుకొచ్చి తాను కాళేశ్వరంపై ఏనాడూ ఫిర్యాదు చేయలేదని రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారు. కూర్చుని మాట్లాడుకుందాం... ప్రాజెక్టులు మీరూ కట్టుకోండి! నీళ్లు వాడుకోండి!! అని ఉచిత సలహాలిచ్చారు.

నీళ్లు తీసుకోండి

గోదావరి నీళ్లు వాడుకొని ప్రాజెక్టులు కట్టుకోవాలంటూ గురువారం చంద్రబాబు ఉచిత సలహా

డ్రామా-7: కేంద్రం ముందు మోకరిల్లడం

అఖిలపక్షం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష నేతలతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలిసి బనకచర్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తే బాగుండేది. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ అవకాశాన్ని ఇవ్వలేదు. కేవలం సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి వెళ్లి కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణకు చెప్పకుండా బనకచర్లపై ముందుకుపోమని హామీ ఇచ్చి, ఇప్పుడు తమకు తెలియకుండానే కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ టీవోఆర్‌ను ఎందుకు ఖరారు చేసిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని ప్రశ్నించాలి. కానీ అదేమీ జరగలేదు. పైగా బనకచర్ల అంశాన్ని అటకెక్కించి, ఇచ్చంపల్లి దగ్గర బరాజ్ నిర్మించి కావేరీకి నీళ్లు తీసుకుపోయే అంశంపై చర్చిద్దామంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది కేంద్రం ముందు మోకరిల్లడమే అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బనకచర్లను అడ్డుకుంటామని అఖిలపక్ష సమావేశంలో చెప్పిన రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లిన తర్వాత చంద్రబాబుతో కూర్చుని బనకచర్లపై మాట్లాడేందుకు సిద్ధమని మీడియా చిట్‌చాట్‌లో చెప్పడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తెలంగాణ భవిష్యత్తు ఏమిటి..?

ఇలా ఏడాదిన్నరగా చోటుచేసుకున్న పరిణామాలతో రాష్ట్ర జలహక్కులపై కత్తి వేలాడుతున్నదని సాగునీటి రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే దీనిని అడ్డుకొని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ కార్యాచరణ ఏమిటనేది అంతుబట్టడంలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించి ప్రాణహితజలాలను వాడుకుంటారా? దిగువన పోలవరానికి వదిలిపెడతారా? అనే దానిపైనా ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గోదావరిపై ఏడాదిలో ఎన్ని రోజులు, ఎంత ఇన్‌ఫ్లో ఉంటాయనేది శాస్త్రీయంగా తేలలేదు. అయినా మోదీ ప్రభుత్వం కావేరీకి గోదావరి జలాలను తన్నుకుపోవడం, సందట్లో సడేమియాలా చంద్రబాబు ఏపీలోని కృష్ణా, పెన్నా బేసిన్‌కు గోదావరి జలాలను తరలించుకుపోవడాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమర్థిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు.

పొరుగు రాష్ట్రం గోదావరి వరద నీళ్లను వాడుకుంటే తప్పేంటి.. గోదావరి నీళ్లతో కృష్ణా బేసిన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల అంశంపై ముందుగా నన్ను సంప్రదించలేదనే కోపం తప్ప నాకు మరోటి లేదు. ఏపీ సీఎం చంద్రబాబు మమ్మల్ని వదిలి కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లడమే మా అభ్యంతరం. ముందుగా ఒక్క మాట మమ్మల్ని అడిగి ఉంటే బనకచర్ల ఇష్యూ ఇంత దూరం వచ్చేదే కాదు.

- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

ఏ సమస్యనైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది మా విధానం. అనవసర వివాదాలపై మాకు ఆసక్తి లేదు. కృష్ణా, గోదావరి నదులు ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రతో ఎలాంటి సంబంధాలను కోరుకుంటున్నమో ఆంధ్రప్రదేశ్‌తో కూడా అలాంటి సంబంధాలనే కోరుకుంటున్నం. ఆంధ్రప్రదేశ్ దిగువ రాష్ట్రంగా ఉంటే మేం కర్ణాటక, మహారాష్ట్రలకు దిగువన, ఆంధ్రప్రదేశ్‌కు ఎగువన ఉన్నం. అందువల్ల ఏపీతో పాటు ఏ రాష్ట్రంతోనూ వివాదాలు కోరుకోవడం లేదు.

- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

రేవంత్ నోట బాబు మాట

గోదావరి వరద జలాలు ఏపీ వాడుకుంటే తప్పేంటని ప్రశ్న

ఏపీ సంప్రదించలేదనే కోపం తప్ప నీళ్లపై అభ్యంతరం లేదట!

నీళ్లు, నిధులు మోసపూరిత సెంటిమెంట్ అంటూ అవహేళన

ఢిల్లీ చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణకు ముప్పుగా పరిణమించిన బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వత్తాసు పలుకుతూ మాట్లాడారు. బాబు నోట వచ్చిన మాటలనే రేవంత్ ఉంటంకించారు. అపెక్స్ సమావేశం కోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేయకుండా చంద్రబాబును చర్చలను ఆహ్వానిస్తామని ప్రకటించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ బయలుదేరే ముందు మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇప్పుడు ప్రధాని మోదీకి చంద్రబాబు అవసరమని, ఏపీలో ఎన్నికలు గెలిచేందుకు చంద్రబాబుకు గోదావరి జలాలు అవసరమని, తెలంగాణలో పార్టీని బతికించుకోవటానికి బీఆర్ఎస్ వాళ్లకు బనకచర్ల ఇష్యూ అవసరమని వ్యాఖ్యానించారు. నీళ్లు, నిధులు అనేది మోసపూరిత సెంటిమెంట్ అని, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను హేళన చేశారు. తెలంగాణలో ప్రాజెక్టులు కట్టింది నిజాం, కాంగ్రెస్ అని, కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు ఏమీ లేవంటూ ద్వేషాన్ని బయటపెట్టుకున్నారు.

భేషజాల్లేవు ..చర్చలకు సిద్ధం

ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరి- బనకచర్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, భేషజాలకూ పోకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి తాము వెనుకాడటం లేదని రేవంత్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు విభజన చట్టం ప్రకారం అధికారులు, సాంకేతిక నిపుణులు, మంత్రులు, అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంటుందని.., కానీ ఏపీ సీఎం నేరుగా బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం అసలు సమస్యకు కారణమైందన్నారు. 'ఏపీ విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినం. ఆయా కమిటీల్లో సమస్యలు చర్చించకుండా చంద్రబాబు నేరుగా కేంద్రం వద్దకు వచ్చారన్నదే మా అభ్యంతరం. ఏపీ తమ ప్రతిపాదనలను ముందుగా తెలంగాణ ప్రభుత్వానికి ఇచ్చి అభిప్రాయం అడిగి ఉంటే ఈ వివాదమే వచ్చేది కాదు' అని చెప్పారు.

స్వయంగా నేనే పిలుస్తా..

అవసరమైతే తానే ఒక అడుగు ముందుకు వేసి చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని రేవంత్ చెప్పారు. 4 రోజులైనా చర్చలు పెడతామని చెప్పుకొచ్చారు. తీసేసిన తహసీల్దార్లు చేసే విమర్శలను తాను పట్టించుకోను అని వ్యాఖ్యానించారు. 'పక్కనే ఉన్న నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కు ఒక్క మాట కూడా చెప్పకుండా బనకచర్ల మీద చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని రేవంత్ ప్రకటించారు. అనంతరం క్యాబినెట్ ప్రస్తావన తీసుకొస్తూ జూన్ 23న క్యాబినెట్ సమావేశంలో చర్చించి, చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని ప్రకటించారు. కృష్ణా నదిలో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌వోసీని తాను అడిగినందుకు హరీశ్‌రావు తప్పుపడుతున్నారని తనకుతాను సమాధానపరుచుకునే ప్రయత్నం చేశారు. కాళేశ్వరం ద్వారా 50 వేల ఎకరాలకే నీళ్లు అందించారని, ఏడాదిలో తెలంగాణలో పండిన అత్యధిక పంటలకు కాళేశ్వరం నీళ్లకు సంబంధమే లేదని ద్వేషపూరితంగా మాట్లాడారు.

ధాన్యం బోనస్..

వట్టి బోగస్

యాసంగి వడ్లకు చెల్లించకపోవడం శోచనీయం

పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి దయనీయం: హరీశ్

హైదరాబాద్, జూన్ 20 (నమస్తేతెలంగాణ): 'ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అన్ని స్కీంల తరహాలో సన్న వడ్లకు బోనస్ పథకం బోగస్ అయ్యింది..సన్నాయి నొక్కులు తప్పా రైతులకు నయాపైసా చెల్లించలేదు..'అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్న వడ్లు సేకరించిన సర్కారు బోనస్ ఇవ్వడంలో విఫలమైందని శుక్రవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ధాన్యం పండించిన అన్నదాతల పరిస్థితి దయనీయంగా ఉంటే పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కొని 75 రోజులు దాటినా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయకపోవడం రేవంత్ సర్కారు నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతున్నదని ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లాలో 50 శాతం మంది రైతులకు నగదు ఇవ్వలేదని, ఇక రాష్ట్రంలోని రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు వేస్తామని ప్రగల్భాలు పలికిన వ్యవసాయ శాఖ మంత్రి..రెండు నెలలు దాటినా ఎందుకు స్పందిచడంలేదని నిలదీశారు. రేవంత్ సర్కారు చేతగానితనంతో రైతులు రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్ధాల పునాదులపైనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని నిప్పులు చెరిగారు. సగం మందికే రుణమాఫీ చేసి, నిరుడు వానకాలంలో రైతుబంధు ఎగ్గొట్టి, ఈ యేడు యాసంగిలో సగమందికే అందించి దగా చేసిందని ధ్వజమెత్తారు. 'నాడు ఓట్ల కోసం ఎకరాకు రూ. 15 వేలు రైతుభరోసా వేస్తామని చెప్పి రూ. 12 వేలకు కుదించారు..కూలీలకు కూడా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు..'అని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రశ్నిస్తేగాని కొనుగోలు కేంద్రాలను కూడా తెరవని అసమర్థ ప్రభుత్వం, సన్నాలు పండించిన రైతాంగానికి ఎగనామం పెట్టిందని నిప్పులు చెరిగారు. వెంటనే బోనస్, సన్‌ఫ్లవర్ రైతులకు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాబుతో రేవంత్ మ్యాచ్ ఫిక్సింగ్

- బనకచర్ల ప్రాజెక్టుపై ముందే ఒప్పందం
- ఢిల్లీలో బయటపడ్డ బనకచర్ల బాగోతం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలే నిదర్శనం
- అపెక్స్‌కౌన్సిల్ మీటింగ్‌ను రేవంత్‌రెడ్డి కోరకపోవడం విడ్డూరం
- తెలంగాణను ముంచేందుకే చర్చలు
- నాడు న్యాయమైన వాటాకు కేసీఆర్ ఫైట్
- నేడు రేవంత్ అవగాహనలేమితో నష్టం
- రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ బనకచర్ల బాగోతం బట్టబయలైంది. ఏపీ సీఎం చంద్రబాబుతో ముందే లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని తెలంగాణను నిండా ముంచేందుకు సిద్ధమైన్రు.. అందుకే అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ కోసం కేంద్రాన్ని డిమాండ్ చేయకుండా చర్చలను తెరపైకి తెచ్చిండ్రు.

-హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తేతెలంగాణ): బనకచర్లపై ముందే ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ సీఎం రేవంత్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని ఇప్పుడు క్యాబినెట్, చర్చలంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. గోదావరి, కృష్ణాలో న్యాయమైన వాటా అడగకుండా తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. రేవంత్ ప్రతిపాదనలతో ట్రిబ్యునల్ ముందు పోరాడితే తెలంగాణ నిండా మునగడం ఖాయమని శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో అపెక్స్ కౌన్సిల్‌కు డిమాండ్ చేయకపోవడం, చంద్రబాబుతో చర్చలు జరుపుతామనడం వెనుక ఉన్న మతలబేమిటో అర్థంకావడంలేదని పేర్కొన్నారు. నాడు కేసీఆర్ గోదావరి జలాల్లో 968 టీఎంసీల వాటా సాధించారని, వరద జలాల్లో మరో 1950 టీఎంసీలు కలిపి మొత్తంగా 2918 టీఎంసీల కోసం పట్టుబట్టారని, కృష్ణాలోనూ 763 టీఎంసీల కోసం ట్రిబ్యునల్ ఎదుట వాదించారని, కానీ తెలంగాణ సీఎం రేవంత్ మాత్రం గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలు చాలని చంద్రబాబుకు గురుదక్షిణ సమర్పించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు.

ఆధారాలు చూపినా అదే దుష్ప్రచారమా!

గతంలో అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ బనకచర్ల గురించి ప్రస్తావించలేదని ఆధారాలతో చూపినా సీఎం రేవంత్ దుష్ప్రచారాన్ని మానుకోవడం లేదని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణా జలాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం 299 టీఎంసీలకే ఒప్పుకొన్నదని తప్పుడు లెక్కలు చెప్తున్నారని ఆక్షేపించారు. అది అప్పటి ప్రాజెక్టుల ఆధారంగా చేసుకున్న తాత్కాలిక ఒప్పందమేనని స్పష్టంచేశారు. అయినా తాము కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో సగం అంటే 405 టీఎంసీలు కేటాయించాలని అడిగామని తెలిపారు. కానీ రేవంత్‌కు మాత్రం తాత్కాలిక, శాశ్వత ఒప్పందం గురించి తెలియకపోవడం శోచనీయమన్నారు.

ఫలించనున్న కేసీఆర్ పోరాటం

కేసీఆర్ కృషితో సెక్షన్-3 ప్రకారం కృష్ణా ట్రిబ్యునల్‌ను సాధించారని హరీశ్ పునరుద్ఘాటించారు. ఈ సెక్షన్ ప్రకారం బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట కృష్ణా జలాల్లో తెలంగాణకు 763 టీఎంసీలు కేటాయించాలని అఫిడవిట్ వేశామని గుర్తుచేశారు. మన న్యాయవాదులు బలమైన వాదనలు వినిపిస్తున్నారని త్వరలో మన వాటా మనకు దక్కే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం కోసుగుంపులో అటవీ శాఖ అధికారుల దాడిలో చినిగిన ఓ మహిళ దుస్తులు

గిరిజన మహిళలపై అటవీ అధికారుల దాష్టీకం

- *దుస్తులు చిరిగినా ఆపని దాడి*
- *సెల్‌ఫోన్లు లాక్కొని దౌర్జన్యం*
- *భద్రాద్రి జిల్లాలో దారుణ ఘటన*

బూర్గంపహాడ్, జూన్ 20: పోడు సాగు చేసుకుంటున్న మహిళా రైతులపై అటవీ అధికారులు, సిబ్బంది దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం ఇరవెండి బీట్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోసుగుంపు గ్రామంలోని పోడు సాగుదారులకు చెందిన భూములోకి అటవీ అధికారులు జేసీబీలతో వెళ్లి కందకాలు తీయిస్తుండగా గిరిజన మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తమను దారుణంగా కొట్టారని, ఓ మహిళ దుస్తులు చినిగిపోయినట్టు తెలిపారు. అక్కడే ఉన్న కొందరు మహిళలు ఈ ఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అధికారులు నాగరాజు, రాంబాబు, సిబ్బంది బాబురావు, ర